సాక్షి ప్రకాశం

శనివారం । 20 । మే । 2023



బెట్టింగులు పెట్టి అప్పుల పాలై..

జిల్లాలో వివిధ కారణాలతో ముగ్గురు యువకులు ఆత్మహత్యకు పాల్పడ్డారు. మర్రిపూడి, దొనకొండ, పెద్దదోర్నాల మండలాల్లో ఈ ఘటనలు జరిగాయి. - IIలో..



కాలనీ నిర్మాణాల్లో అలసత్వం వద్దు

వైఎస్సార్ జగనన్న కాలనీ లేఔట్లలో నిర్మాణాలు వేగవంతం చేయాలని జేసీ శ్రీనివాసులు ఆదేశించారు. పాములూరు మండలంలో జగనన్న కాలనీని పరిశీలించారు. - IIలో..

గరిష్టం/కనిష్టం
42 /28

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉక్కపోత అధికం. వడగాలులు వీస్తాయి. ఉష్ణోగ్రతలు పెరుగుతాయి.

న్యూస్‌రీల్

రేపటి నుంచి సాక్షి ఆధ్వర్యంలో తైక్వాండో శిక్షణ

ఒంగోలు: సాక్షి మీడియా ఆధ్వర్యంలో తైక్వాండోలో శిక్షణ ఇచ్చేందుకు ఉచిత సమ్మర్ క్యాంపు ఈనెల 21వ తేదీ నుంచి స్థానిక సీవీఎన్ రీడింగ్‌లో రూములో నిర్వహిస్తారు. ఉదయం 6 నుంచి 8 గంటల వరకు తైక్వాండో జాతీయ కోచ్, చాంపియన్ ఎస్కే కరిముల్లా శిక్షణ ఇస్తారు. ఆసక్తిగల యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

స్టెనో కం టైపిస్ట్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: స్థానిక పర్మినెంట్ లోక్‌అదాలత్‌లో స్టెనో కం టైపిస్ట్ పోస్టుకు ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈనెల 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ చైర్‌పర్సన్ ఎ.భారతి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఒకపోస్టు మాత్రమే ఉందని, నెలకు రూ.25,220 కన్సాలిడేటెడ్ వేతనం ఇస్తారన్నారు. దరఖాస్తు చేసుకునేవారు డిగ్రీ ఉత్తీర్ణతతోపాటు షార్ట్‌హ్యాండ్ ఇంగ్లిష్ హయ్యర్ గ్రేడ్, హయ్యర్ గ్రేడ్ ఇంగ్లిష్ టైపురైటింగ్ కలిగి ఉండాలి. ఒక వేళ ఎవరైనా షార్ట్‌హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ అభ్యర్థులు రాని పక్షంలో షార్ట్‌హ్యాండ్ లోయర్ గ్రేడ్ అభ్యర్థులను పరిగణలోనికి తీసుకుంటారు. ఒకరికంటే ఎక్కువమంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకుంటే వారికి స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. 2022 జూలై 1వ తేదీ నాటికి 18 సంవత్సరాలు నిండి 42 సంవత్సరాల వయస్సు మించనివారు అర్హులు. ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 5 సంవత్సరాలు, శారీరక వైకల్యం కలిగిన వారికి, మాజీ సైనికోద్యోగులకు 10 సంవత్సరాల వయస్సు సడలింపు ఉంటుంది. విద్యార్హతల పత్రాలు, పుట్టిన తేదీ ధ్రువపత్రం, కమ్యూనిటీ సర్టిఫికెట్, సొంత చిరునామాగల పోస్టల్ ఎన్వలప్ కవరు ఒకటి, రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు ఇటీవల తీసినవి, శారీరక వైకల్యం కలిగిన వారు దానికి సంబంధించిన పత్రాన్ని జతచేసి జిల్లా న్యాయసేవాధికార సంస్థ, జిల్లా కోర్టు కాంపౌండ్, ఒంగోలు-523001 అన్న చిరునామాకు పంపాలన్నారు.

సోమవారం స్పందన గిద్దలూరులో..

ఒంగోలు అర్బన్: జిల్లా కేంద్రం ఒంగోలులో కలెక్టర్ ఆధ్వర్యంలో ప్రతి సోమవారం జరిగే స్పందన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం 22వ తేదీ గిద్దలూరులో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ స్పందన కార్యక్రమం ఉదయం 10 నుంచి 2 గంటల వరకు చీతిరాల వెంకటేశ్వర్లు కళ్యాణ మండపంలో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. దీనికి జిల్లా అధికారులు హాజరవుతారని చెప్పారు.

ఆదర్శ పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఒంగోలు: జిల్లాలోని ఆరు ఆదర్శ పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరంలో విద్యార్థులు ప్రవేశం పొందేందుకు ఆన్‌లైన్ ద్వారా ఎంపీసీ/బైపీసీ/ఎంఈసీ/సీఈసీ గ్రూపుల్లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారి పి.రమేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంగ్ల మాధ్యమంలో బోధన ఉంటుందని, విద్యార్థులు ఎటువంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. జిల్లాలో ప్రభుత్వ లేక ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే అర్హులు. ఈనెల 22 నుంచి జూన్ 7వ తేదీలోపు పేమెంట్ గేట్‌వే ద్వారా పరీక్ష రుసుము చెల్లించిన తరువాత వారికి జనరల్ నెంబర్ కేటాయిస్తారని, ఆ జనరల్ నంబర్ ఆధారంగా ఏదేని ఇంటర్నెట్ కేంద్రంలో డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సీఎస్ఈ.ఏపీ.జీవోవి.ఇన్//ఏపీఎంఎస్.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ వారు రూ.200, ఎస్సీ, ఎస్టీలు రూ.150 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. పదో తరగతి మార్కుల మెరిట్ ద్వారా రిజర్వేషన్ రూల్స్ ప్రకారం సీట్లు ఇస్తారని డీఈవో పి.రమేష్ పేర్కొన్నారు.

తరగతి గది.. స్మార్ట్‌గా..!

- తొలిదశలో జిల్లాలోని 722 ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్య
- దృశ్య వీక్షణ ద్వారా విద్యార్థుల్లో సామర్థ్యాల పెంపు
- నాడు-నేడు ద్వారా సౌకర్యాల కల్పన
- జిల్లాకు 445 స్మార్ట్, 277 ఐఎఫ్‌పీలు కేటాయింపు
- పాఠశాలలకు 4జి ఇంటర్నెట్ సౌకర్యం

ఇప్పటి వరకూ శ్రీమంతుల బిడ్డలకే అందుబాటులో ఉన్న డిజిటల్ విద్య నేడు పేద విద్యార్థులకు కూడా అందుతోంది. సర్కార్ పాఠశాలల్లో 1వ తగరతి నుంచే స్మార్ట్ క్లాస్ రూములు అందుబాటులోకి రానున్నాయి. ఈ డిజిటల్ విప్లవం ద్వారా కార్పొరేట్, ప్రైవేటు సంస్థల్లో చదువుతున్న విద్యార్థులకు ఏమాత్రం తీసిపోని విధంగా ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థులు ఉత్తమ విద్యా ప్రమాణాలు అందుకునే అవకాశం ఉంది.

ఒంగోలు:

పాఠశాలలు సాంకేతికత విప్లవాన్ని సృష్టించబోతున్నాయి. ఇన్నాళ్లు కేవలం ఉపాధ్యాయుడు చెప్పింది శ్రద్ధగా ఆలకించడం, ఆపై అభ్యసనంపైనే విద్యార్థులు దృష్టిసారిస్తూ వస్తున్నారు. అయితే ప్రపంచ స్థాయిలో మన విద్యార్థులు పోటీపడాలంటే ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని మనమూ వినియోగించుకోవాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెబుతున్న విషయం తెలిసిందే. దానిని అక్షరబద్ధం చేస్తూ విద్యాశాఖ అధికారులు చర్యలు చేపడుతున్నారు. ప్రయోగాలే కాకుండా దృశ్య వీక్షణ ద్వారా చిన్నారుల మెదడుపై బలమైన ముద్ర పడేలా, విద్యార్థుల సామర్థ్యాల పెంపే లక్ష్యంగా వినూత్నమైన డిజిటల్ బోధన త్వరలో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నుంచి అందుబాటులోకి తెస్తున్నారు.

తొలి దశలో 722 పాఠశాలల్లో ఏర్పాటు: జిల్లాలో తొలి దశలో 722 పాఠశాలల్లో సాంకేతికతను అందుబాటులోకి తెస్తున్నారు. బైజూస్ సేవలను వినియోగించుకుంటూ ప్రారంభమయ్యే ఈ శిక్షణ కోసం 1 నుంచి 5 తరగతుల వరకు విద్యార్థుల సౌకర్యార్థం స్మార్ట్ టీవీలు ఏర్పాటు చేస్తారు. 6వ తరగతి నుంచి పదో తరగతి వరకు ఉండే పాఠశాలల్లో ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్ (ఐఎఫ్‌పీ) లను ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో 445 ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్‌టీవీలు, 277 ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీలను అందుబాటులోకి తీసుకురానున్నారు. అయితే ఇవన్నీ ఏర్పాటు చేయాలంటే ఆ తరగతి గదిలో అవసరమైన ప్రాథమిక సౌకర్యాల కల్పనపై ప్రస్తుతం ప్రభుత్వం దృష్టి సారించింది. అంటే తరగతి గదిలో అవసరమైన ప్రాంతంలో విద్యుత్ సదుపాయం, పాఠశాలకు 4 జీ ఇంటర్నెట్ సదుపాయం కల్పించడం తదితరాలపై సంబంధిత పాఠశాలల హెడ్మాస్టర్లను నాడు-నేడు ఎస్ఎంటీ యాప్‌లో పొందుపరచాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఆదేశించారు.



ఉపయోగం ఇలా..

బైజూస్‌తో టై అప్ అయి మాడ్యూల్‌ను విద్యార్థులకు ట్యాబ్‌ల రూపంలో అందించినప్పటికీ తరగతిలో ఉపాధ్యాయుని సమక్షంలో పాఠ్యాంశాలను దృశ్య వీక్షణ ద్వారా చూడడం విద్యార్థులకు ఒక గొప్ప అనుభూతిని కల్పించబోతోంది. ఉపాధ్యాయులకు కూడా విద్యాబోధనలో అవసరమైన ప్రయోగాల కల్పన నేరుగా స్క్రీన్‌పై విద్యార్థులు చూసేందుకు అవకాశం కలగడం, దానిని ఉపాధ్యాయుడు విద్యార్థులకు అవసరమయ్యే రీతిలో స్క్రీన్‌ని కొద్దిసేపు నిలిపి మరీ చూపించగలగడం కీలక అంశం. ఇదే కాకుండా ఈ బోర్డును బ్లాక్ బోర్డులా ఉపయోగించవచ్చు. రాసిన దానిని చెరపవచ్చు. లేదా రాసిన విషయాన్ని సేవ్ చేసుకోవచ్చు. ఇంటర్నెట్ వినియోగించి కంప్యూటర్ మాదిరిగా వినియోగించుకోవచ్చు. యూట్యూబ్, ఫోన్ లేదా ట్యాబ్‌లోని సమాచారం సైతం స్క్రీన్‌పై చూసేందుకు అవకాశం కలుగుతుంది.

445 ప్రాథమిక పాఠశాలల్లో స్మార్ట్‌టీవీలు:

అర్థవీడు మండలంలో 8 పాఠశాలలు, బీవీ.పేట 20, సీఎస్‌పురం 6, చీమకుర్తి 14, కంభం 9, దర్శి 23, దొనకొండ 10, గిద్దలూరు 16, హనుమంతునిపాడు 4, కనిగిరి 9, కొమరోలు 5, కొనకనమిట్ల 16, కొండపి 13, కొత్తపట్నం 10, కురిచేడు 10, మద్దిపాడు 10, మార్కాపురం 15, మర్రిపూడి 11, ముండ్లమూరు 15, నాగులుప్పలపాడు 9, ఒంగోలు 5, పీసీపల్లి 3, పెదదోర్నాల 11, పాములూరు 9, పెద్దారవీడు 15, పొదిలి 16, పొన్నలూరు 8, పుల్లలచెరువు 12, రాచర్ల 4, సంతనూతలపాడు 13, సింగరాయకొండ 8, తాళ్లూరు 15, టంగుటూరు 14, తర్లుపాడు 9, త్రిపురాంతకం 17, వెలిగండ్ల 6, వై.పాలెం 42, జరుగుమల్లి మండలంలో 5 పాఠశాలలు.

277 ఉన్నత పాఠశాలల్లో ఐఎఫ్‌పీలు (ఇంటరాక్టివ్ ఫ్లాట్ పానల్స్)

అర్థవీడు మండలంలో 5 పాఠశాలలు, బీవీ.పేట 9, సీఎస్‌పురం 5, చీమకుర్తి 10, కంభం 4, దర్శి 18, దొనకొండ 7, గిద్దలూరు 9, హెచ్ఎంపాడు 3, కనిగిరి 12, కొమరోలు 5, కొనకనమిట్ల 9, కొండపి 4, కొత్తపట్నం 3, కురిచేడు 6, మద్దిపాడు 4, మార్కాపురం 17, మర్రిపూడి 7, ముండ్లమూరు 10, నాగులుప్పలపాడు 5, ఒంగోలు 8, పీసీపల్లి 5, పెదదోర్నాల 13, పాములూరు 6, పెద్దారవీడు 7, పొదిలి 7, పొన్నలూరు 7, పుల్లలచెరువు 7, రాచర్ల 4, సంతనూతలపాడు 6, సింగరాయకొండ 7, తాళ్లూరు 7, టంగుటూరు 2, తర్లుపాడు 6, త్రిపురాంతకం 9, వెలిగండ్ల 5, వై.పాలెం 15, జరుగుమల్లి మండలంలో 4 పాఠశాలలు.

నాడు-నేడు ద్వారా నిధులు:



నాడు-నేడు ద్వారా పాఠశాలల్లో సాంకేతిక విప్లవం సృష్టించబోతోంది. స్మార్ట్‌టీవీలు, ఐఎఫ్‌పీల ఏర్పాటు ద్వారా అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యాభ్యాసాన్ని సొంతం చేసుకునే సౌలభ్యం కలుగుతుంది. ఏం కావాలనే వివరాలను పాఠశాలల హెచ్ఎంలు ఎస్ఎంటీ యాప్‌లో నమోదు చేస్తున్నారు. సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు వీటిని పర్యవేక్షిస్తారు.

– డీఈవో, సమగ్రశిక్ష ఏపీసీ పి.రమేష్

విద్యార్థులకు అత్యంత సౌకర్యం



సాంకేతికతను జోడించి విద్యాబోధన చేస్తుండడం ద్వారా భవిష్యత్‌లో మంచి ఫలితాలు లభిస్తాయి. ఇది విద్యార్థులకు వరం, సాంకేతిక పరికరాలను వినియోగిస్తూ ఉపాధ్యాయులు కీలక భూమిక పోషించినప్పుడే అనుకున్న లక్ష్యం నెరవేరుతుంది.

– కొప్పోలు అశోక్, బైజూస్ జిల్లా నోడల్ అధికారి

వలంటీర్లకు అండగా ఉంటా...



వలంటీర్లకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే, బాలినేని శ్రీనివాసరెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, కలెక్టర్ దినేష్ కుమార్



సేవా మిత్ర, సేవా రత్న, సేవా వజ్ర పురస్కారం పొందిన వలంటీర్లతో బాలినేని శ్రీనివాసరెడ్డి, బూచేపల్లి వెంకాయమ్మ, దినేష్‌కుమార్

- వలంటీర్ల సేవలకు సలాం
- ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా వలంటీర్లు
- వలంటీర్లకు వందనంలో ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి

ఒంగోలు అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన వలంటీర్ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ సేవలందిస్తున్న వలంటీర్లకు సలాం అని, వారికి అన్నీ విధాలా అండగా ఉంటానని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరపాలక పరిధిలో పనిచేస్తున్న వలంటీర్ల సేవలకు గుర్తింపుగా వారికి సేవామిత్ర, సేవారత్నం, సేవావజ్ర పురస్కారాలు అందించేందుకు ఏ1 కన్వెన్షన్ హాలులో శుక్రవారం 'వలంటీర్లకు వందనం' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించడంలో వలంటీర్ల పాత్ర అభినందనీయమన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో తిరుగుతున్నప్పుడు ప్రతి ఇంటితో వలంటీర్ మమేకమైన తీరును ప్రత్యక్షంగా చూశానన్నారు. వలంటీర్లకు అన్నీ విధాలుగా అండగా ఉంటానని, ఏ సమస్య వచ్చినా అన్నీ వేళలా తోడుగా నిలుస్తానని భరోసా ఇచ్చారు.

కలెక్టర్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ స్థానికంగా ఉంటూ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని కల్పించడంలో వలంటీర్లు చేస్తున్న సేవలకు గుర్తింపుగా సన్మానించాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి నిర్ణయించడం గొప్ప విషయమన్నారు. సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవల్లో మన జిల్లా రాష్ట్రంలో తొలి రెండు స్థానాల్లో నిలుస్తుండటంలో వలంటీర్ల పాత్ర ఎంతో కీలకంగా ఉందన్నారు. జిల్లాలో మొత్తం 10365 మంది వలంటీర్లను పుస్కారాలకు ఎంపిక చేశారని చెప్పారు.

జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ప్రతి విపత్తులో వలంటీర్లు ప్రతి ఇంటికీ అండగా నిలిచారని అన్నారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు చేర్చడంలో వలంటీర్ల పాత్రం మరువలేనిదన్నారు.

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వలంటర్లీ పనితీరు, ఆ ప్రాంత కుటుంబాలు వ్యక్తం చేస్తున్న సంతృప్తి, గడగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో వలంటర్లీ హాజరు శాతం, ప్రతి నెల మొదటి రోజున 100 శాతం పెన్షన్ పంపిణీ, సంక్షేమ పథకాల అమలులో వలంటీర్ల క్లస్టర్ పరిధి, లబ్దిదారుల గుర్తింపు తదితర వివరాల నమోదును ప్రామాణికంగా తీసుకుని కార్పొరేషన్ పరిధిలో 1169 మందిని ఈ పురస్కారాలకు ఎంపిక చేసినట్లు వివరించారు. సేవావజ్ర కింద ఒక్కొక్కరికి రూ.30 వేలు లెక్కని ఇద్దరిని, సేవారత్నం కింద రూ.20 వేలు చొప్పున 12 మంది, సేవా మిత్ర కింద రూ.10 వేలు చొప్పు 1155 మందిని ఎంపిక చేసినట్లు తెలిపారు. వీరందరికీ మంజూరు చేసిన రూ.1,18,50,000 విలువైన బ్యాంకు చెక్కును బాలినేని ఇతర అతిథులు చేతులమీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు వలంటీర్లు ప్రజలకు అందిస్తున్న సేవల పట్ల ప్రజలు వ్యక్తం చేస్తున్న సంతృప్తిని తెలియజేశారు.

కార్యక్రమంలో ఆర్యవైశ్య కార్పొరేషన్ చైర్మన్ కుప్పం ప్రసాద్, మాదిగ కార్పొరేషన్ చైర్మన్ కొమ్మూరి కనకారావు, సూర్యబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి కరుణాకర్, మేదర కార్పొరేషన్ చైర్మన్ లలితా నాంచారమ్మ, ఓయూడీఏ చైర్మన్ శింగరాజు మీనాకుమారి, ఇన్‌చార్జ్ మేయర్ వేమూరి సూర్యనారాయణ, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి, సచివాలయాల నోడల్ అధికారి ఉషారాణి, ఒంగోలు ఎంపిపి మల్లికార్జున రెడ్డి, కార్పొరేటర్‌లు అంబటి ప్రసాదరావు, ఆదిపూడి గిరిజా శంకర శాండిల్య తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్, పక్కన కలెక్టర్, జెడ్పీ చైర్‌పర్సన్

- ఆర్‌బీకేల ద్వారా రైతులకు మెరుగైన సేవలందించాలి
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు అర్బన్: వ్యవసాయ సీజన్ ప్రారంభమవుతున్న నేపథ్యంలో రైతులకు అవసరమైన విత్తనాలు, ఎరువులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలని, ఆ మేరకు తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ సూచించారు. శుక్రవారం ప్రకాశం భవనంలో జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సమావేశం చైర్మన్ ఆళ్ల రవీంద్రారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. దీనిలో పాల్గొన్న మంత్రి సురేష్ మాట్లాడుతూ గత ఏడాది వినియోగాన్ని, ప్రస్తుత ఏడాది పరిస్థితులను అంచనా వేసి ముందుగానే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాలన్నారు. ఎరువులు, విత్తనాలను ఆర్‌బీకేల ద్వారా రైతులకు అందించాలని ఆర్‌బీకేల ద్వారా రైతులకు మరింత మెరుగైన సేవలందించాలన్నారు. ఎంఆర్‌పీ ధరలు ఉల్లంఘించి ఎరువులు, విత్తనాలు విక్రయించకుండా బహిరంగ మార్కెట్‌పై నిఘా ఉంచాలన్నారు.

కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి నెలా ఆర్బీకే, మండల స్థాయిలో జరిగే వ్యవసాయ సలహా కమిటీ సమావేశాల్లో సభ్యులు ప్రస్తావిస్తున్న అంశాలకు అధిక ప్రాధాన్యం ఇచ్చి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన అంశాలపై జిల్లా వ్యసాయ సలహా కమిటీ సమావేశంలో తీర్మానం చేసి ప్రభుత్వానికి పంపుతామని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ఎటువంటి పరిస్థితిలు ఎదురైనా ప్రభుత్వం తరపున అండగా ఉంటామనే ధైర్యం రైతులకు కల్పించాలన్నారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా పంట దెబ్బతిన్న రైతులను త్వరగా ఆదుకునేలా పర్యవేక్షించాలన్నారు. ఎండల వల్ల పశువులు చనిపోకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పించాలని సూచించారు.

వ్యవసాయ సలహామండలి జిల్లా అధ్యక్షుడు ఆళ్ల రవీంద్రారెడ్డి మాట్లాడుతూ పంటల సేకరణ, ఈక్రాప్ బుకింగ్ ప్రక్రియలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను సత్వరమే పరిష్కరించాలని కోరారు. రైతులు కోరిన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ఆర్బీకే బిల్లులు త్వరగా ప్రభుత్వం నుంచి వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. దీనిలో పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాసరావు, పశుసంవర్ధక శాఖ అధికారి బేబిరాణి, ఆత్మ పీడీ అన్నపూర్ణ, డీఆర్‌డీఏ పీడీ బాబురావు, ఏపీఎంఐపీ పీడీ రవీంద్రబాబు, ఉద్యాన వన అధికారి గోపిచంద్, మార్క్‌ఫెడ్ డీఎం హరికృష్ణ, మార్కెటింగ్ ఏడీ ఉపేంద్ర, పౌరసరఫరాల సంస్థ డీఎం గ్లోరియా, ప్రకృతి వ్యవసాయ అధికారి సుభాషిణి, వ్యవసాయ శాఖ ఏడీలు, ఏఓలు, మండల వ్యవసాయ సలహా కమిటీల అధ్యక్షులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వ్యవసాయ, మత్స్య శాఖలు రూపొందించిన పోస్టర్లను అతిథులు ఆవిష్కరించారు.

మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థకు రూ.445.87 కోట్లు మంజూరు

- పలు ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు
- రాష్ట్రంలో 313 ప్రాజెక్టుల కోసం రూ.5366.21 కోట్లు
- జీవో నంబర్ 68 విడుదల
- పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు అర్బన్: రాష్ట్ర నీటి ప్రణాళికలో భాగంగా అమృత్ 2.0 పథకం కింద జిల్లాలోని మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో పలు పనులు చేపట్టేందుకు రూ.445.87 కోట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఆదిమూలపు సురేష్ తెలిపారు. శుక్రవారం ప్రకాశం భవనంలో విలేకర్లతో మాట్లాడిన మంత్రి వివరాలు వెల్లడించారు. మున్సిపాలిటీలు, నగరపాలక సంస్థల్లో పలు ప్రాజెక్టులు చేపట్టేందుకు విడుదల చేసిన నగదుకు సంబంధించి జీవో నంబర్ 68ని విడుదల చేసినట్లు తెలిపారు. నీటి సరఫరా కోసం పొదిలికి రూ.110 కోట్లు, మార్కాపురానికి రూ.74.22 కోట్లు,



మీడియాతో మాట్లాడుతున్న మంత్రి ఆదిమూలపు సురేష్

గిద్దలూరు రూ.2.54 కోట్లు, కనిగిరి రూ.3.74 కోట్లు, చీమకుర్తి రూ.2.76 కోట్లు, ఒంగోలు నగరపాలక సంస్థకు రూ.88.75 కోట్లు రానున్నట్లు తెలిపారు. సీవరేజ్, సెప్టేజ్ నిర్వహణ కోసం ఒంగోలు కార్పొరేషన్‌కు రూ.158.52 కోట్లు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అదేవిధంగా నీటి వనరుల ఆధునికీకరణ, పచ్చదనం పరిశుభ్రత కోసం దర్శికి రూ.1.1 కోట్లు, ఒంగోలుకు రూ.4.24 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. మొత్తంగా ప్రకాశం జిల్లాలో 7 ప్రాజెక్టులకు సంబంధించి రూ.445.87 కోట్ల విలువైన పనులు చేపట్టేందుకు ప్రభుత్వం నిధులు మంజూరు చేసిందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఈ రకమైన 313 ప్రాజెక్టుల కోసం రూ.5366.21 కోట్లు ఖర్చు చేయనున్నట్లు మంత్రి తెలిపారు. నగర పంచాయతీలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్‌లలో పెరుగుతున్న జనాభా అవసరాలను తీర్చేలా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందన్నారు. తాగునీటి సరఫరా, మురుగు నీటి నిర్వహణ, పచ్చదనం, పరిశుభ్రతకు రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఆ మేరకు నిధులు మంజూరు చేస్తూ జీవో జారీ చేయడమే దీనికి నిదర్శనమని చెప్పారు.

వివాహిత హత్యపై ముమ్మర దర్యాప్తు

- నాలుగు బృందాలుగా రెండు రాష్ట్రాల్లో గాలింపులు
- పలు కోణాల్లో పోలీసుల విచారణ

కనిగిరి రూరల్: వెలిగండ్ల మండలం జిల్లెల్లపాడుకు చెందిన కే రాధ (35) హత్యోదంతంలో పోలీసులు పలు కోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు. జిల్లా నుంచి నాలుగు పోలీస్ బృందాలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో నిందితుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ప్రధాన అనుమానితుడు కాశయ్య కేంద్రంగా ముమ్మర దర్యాప్తు సాగుతున్నా, రాధ హత్య కేసులో మూడు కోణాల్లో పోలీసులు దర్యాప్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. సాంకేతిక పరిజ్ఞానం సహాయంతో దాదాపు అసలు నిందితులను గుర్తించి, కేసు పురోగతిలో ముందడుగు వేయనున్నట్లు తెలిసింది. ప్రధానంగా హతురాలు రాధ ఫోన్ నంబర్‌కు ఎవరెవరి కాల్స్ వచ్చాయి.. ఏ లొకేషన్ పరిధిలో నుంచి ఏ ఫోన్ నుంచి మెసేజ్‌లు వచ్చాయి.. ఆయా ఫోన్ సెల్ సిగ్నల్స్ ఏ ఏ మండలాల్లోని టవర్ లొకేషన్ పరిధిలోకి వెళ్లాయి.. అనే దానిపై సాంకేతిక టీం, సీసీ పుటేజీలో అనుమానాస్పదంగా కనిపించిన ఎరుపు, తెలుపు కార్లు ఏ రాష్ట్రానివి, ఎవరివి అనే కోణం మరో టీం, మూడో కోణంలో సమగ్ర విచారణ చేసేందుకు మరో టీం పనిచేస్తున్నట్లు సమాచారం. కేసు విచారణ అధికారిగా పామూరు సీఐ వ్యవహరిస్తున్నారు. ఈ కేసులో అన్ని కోణాల్లో దర్యాప్తు సాగుతుందని, నాలుగు పోలీసు దర్యాప్తు బృందాలు ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో గాలింపు చర్యలు చేపట్టారని, శనివారం కీలక సమాచారం తెలిసే అవకాశం ఉందని డీఎస్పీ ఆర్ రామరాజు 'సాక్షి'కి తెలిపారు.



ఘటనా స్థలం వద్ద మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసు అధికారులు

క్లుప్తంగా

రూ.3.56 లక్షల విలువైన ఎరువులు సీజ్


రికార్డులను తనిఖీ చేస్తున్న అధికారుల బృందం

మార్కాపురం: ఎరువుల అమ్మకాలకు సరైన పత్రాలు లేని కారణంగా మార్కాపురం పట్టణంలోని వివిధ షాపుల్లో ఉన్న 3.56 లక్షల రూపాయల విలువైన ఎరువులను సీజ్ చేసినట్లు ఏవో దేవిరెడ్డి శ్రీనివాసులు తెలిపారు. శుక్రవారం సాయంత్రం పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాల్లో ఆకస్మికంగా తనిఖీలు నిర్వహించారు. నిల్వల్లో వ్యత్యాసాలున్న దుకాణాల్లో అమ్మకాలు నిలిపివేశారు. మొత్తం 16.54 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేసినట్లు చెప్పారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఏవో సంఘమేశ్వరరెడ్డి, సిబ్బంది చంద్రశేఖర్‌రెడ్డి, చిన్నికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వడదెబ్బ తగిలి వ్యక్తి మృతి


మృతిచెందిన సింగయ్య

పొన్నలూరు: మండలంలోని పెదవెంకన్నపాలెం గ్రామంలో చుండి సింగయ్య (63) వడదెబ్బతో మృతి చెందాడు. నాలుగు రోజులుగా కాస్తున్న తీవ్ర ఎండలతో పాటు వడగాడ్పులకు అస్వస్థతకు గురైన సింగయ్య.. శుక్రవారం మృతి చెందినట్లు బంధువులు తెలిపారు.

డీటీసీ డీఎస్పీ రామకృష్ణ బదిలీ


రామకృష్ణ

ఒంగోలు టౌన్: రాష్ట్రంలో పలువురు డీఎస్పీలకు పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. అందులో భాగంగా ఒంగోలు డీటీసీ డీఎస్పీగా విధులు నిర్వహిస్తున్న జి.రామకృష్ణకు అడిషనల్ ఎస్పీగా పదోన్నతి కల్పిస్తూ అనంతపురం సెబ్ అడిషనల్ ఎస్పీగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

మార్టూరు: చేసిన అప్పులు తీర్చలేక మనస్తాపంతో ఓ వ్యక్తి బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈఘటన శుక్రవారం మండలంలోని పూనూరులో జరిగింది. పోలీసుల వివరాల మేరకు.. యద్దనపూడి మండలం పూనూరు గ్రామానికి చెందిన మేకా రమేష్ (46) కార్పెంటర్‌గా పనిచేస్తూ చాలా కాలం హైదరాబాద్‌లో నివాసం ఉన్నాడు. అప్పుల పాలై గత కొంత కాలం క్రితం స్వగ్రామం పూనూరుకు చేరుకున్నాడు. ఈబాధలో రెండు నెలల క్రితం రమేష్ ఆత్మహత్యాయత్నం చేయగా అప్పటినుంచి అత్తగారి గ్రామం జే.పంగులూరు మండలం రామకూరులో నివాసముంటున్నాడు. ఈ క్రమంలో గురువారం బొల్లాపల్లి ఎన్ఎస్పీ కాలువ సమీపంలో రమేష్ పురుగు మందుతాగి ఆత్మహత్యకు పాల్పడిన విషయాన్ని బంధువుల ద్వారా భార్య ఆదెమ్మ సమాచారం అందుకుంది. బంధువుల సాయంతో చిలకలూరి పేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే రమేష్ మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. రమేష్‌కు ఇద్దరు మగపిల్లలు. భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై వెంకటేశ్వరరావు తెలిపారు.

ధర ఘాటు అదిరింది

- క్వింటా మిర్చి రూ.50 నుంచి రూ. 60 వేలు
- కొత్త రకం వంగడాల సాగుపై రైతుల ఆసక్తి


రైతు పండించిన బేడగి రకం మిర్చి

బేస్తవారిపేట: ప్రస్తుతం మిర్చి పంట ఆశలు రేకెత్తిస్తోంది. మంచి ధర రావడంతో ఆరుగాలం శ్రమించిన రైతాంగం ఉత్సాహంగా ఉంది. వాణిజ్య పంటల్లో మిరపకు డిమాండ్ ఎక్కువ. అధిక దిగుబడినిచ్చే హైబ్రీడ్, కొత్త రకాలను సాగు చేసేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. అయితే వాతావరణం అనుకూలించకపోయినా, ధరలు రాకపోయినా రైతులు పాతాళంలోకి వెళ్లినట్లే. అందుకే ముందు జాగ్రత్తగా ఎక్కువ లాభాలు ఆర్జించేందుకు కొత్త వంగడాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. మార్కెట్‌లో మంచి ధర పలికే రకాలతో సాగు చేపట్టారు. ఈ నేపథ్యంలో బేడగి రకం కాసుల పంట కురిపించింది. కర్ణాటక రాష్ట్రంలోని బైడ్గి పట్టణంలో మొట్టమొదటగా ఎక్కువగా పండించారు. ఇది రెండు రకాలుగా ఉంటుంది. డబ్బీ రకం అనేది చిన్న, బొద్దుగా, తక్కువ కారం, ఎక్కువ గింజలతో ఉంటుంది. కడ్డీ రకం ముతకగా, సన్నగా పొడవుగా తక్కువ గింజలతో ఉంటుంది. ఈ మిరప నుంచి తీసే ఓలియో రెజిం రసాయనాన్ని గోర్ల పెయింట్, లిప్‌స్టిక్, టేస్టీ స్పైసీ వంటకాల్లో వాడతారు. మసాలా తయారీ సంస్థలు (ఎంటీఆర్), ఎర్రటి నూనెతో మాంసం తయారు చేసే సంస్థలు, గార్నిషింగ్, సూప్ తయారీ, టెక్స్‌టైల్ పిగ్మెంట్‌లు, ఫార్మాసూటికల్ ఉత్పత్తులు కోసం దీనిని ఉపయోగిస్తారు. అలాగే కేరళలో ఓలియో రిజిన్ రసాయనం శుద్ధి చేసి యూఎస్, జపాన్, ఐరోపా దేశాలకు ఎగుమతి చేస్తారు.

ఈ మిర్చి రకంలో పొటాషియం ఎక్కువగా ఉండటంతో గుండె జబ్బుల నివారణలో ఉపయోగపడుతుంది. యాంటీఆక్సిడెంట్‌లు, విటమిన్-సీ, స్థూలకాయ నివారణ, ఇన్సులిన్ నియంత్రణ, రోగనిరోధక శక్తి పెంచడం, ఆరోగ్యకరమైన ఎర్రరక్తకణాల ఏర్పాటులో తోడ్పడుతుంది.

కొత్తపల్లె, పిటికాయగుళ్లలో సాగు

మండలంలోని ఆర్. కొత్తపల్లె, పిటికాయగుళ్ల గ్రామాల్లోని పలువురు రైతులు మొట్టమొదటగా ఈ ప్రాంతంలో బేడగి రకం మిర్చి సాగు చేశారు. కొత్తపల్లెకు చెందిన రైతు సంగు రమణారెడ్డి ఎకరా పొలంలో 18 క్వింటాళ్లు, పిటికాయగుళ్లకు చెందిన చిలకల వెంకటరెడ్డి రెండు ఎకరాల్లో 35 క్వింటాళ్లు, ఉప్పర్లపాటి గురువారెడ్డి ఎకరాకు 14 క్వింటాళ్లు, మల్లెల అంకిరెడ్డి ఎకరాకు 15 క్వింటాళ్ల దిగుబడి సాధించారు. గుంటూరు మిర్చి యార్డులో క్వింటా రూ.50–60 వేల చొప్పున ధర పలికింది.

> **దిగుబడి బాగానే వచ్చింది:**
>
> 
>
> మన ప్రాంతంలో బేడగి రకం మిర్చి సరిగా పండుతుందో లేదో అనే అనుమానంతో ఎకరా పొలంలో సాగు చేశా. పంట దిగుబడి బాగానే వచ్చింది. 18 క్వింటాళ్లు దిగుబడి రాగా క్వింటా రూ.55 వేలకు అమ్మాను. గుంటూరులో ఈ రకానికి మంచి ధర వస్తుందని తెలుసుకుని విత్తనాలు తెచ్చుకుని నారు పోసుకున్నా. పండిన కాయ మనం నేరుగా తినవచ్చు, ఘాటు ఎక్కువగా ఉండదు, రక్తం రంగులో ఉంటుంది.
>
> సంగు గురువారెడ్డి, ఆర్. కొత్తపల్లె

బెట్టింగులు పెట్టి అప్పలపాలై...

- విషయం ఇంట్లో తెలియడంతో యువకుడు ఆత్మహత్య
- మద్దిపూడి మండలం పన్నూరు గ్రామంలో ఘటన
- దొనకొండ, పెద్దదోర్నాల మండలాల్లో ఇతర కారణాలతో మరో ఇద్దరు యువకుల ఆత్మహత్య


చిన్నమస్తాన్‌రెడ్డి మృతదేహం


పెరుమాళ్ల శాంతయ్య మృతదేహం


రామాంజనేయులు మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్సై

మద్దిపూడి: జిల్లాలోని వేరువేరు ప్రాంతాల్లో వేరువేరు కారణాలతో ముగ్గురు యువకులు ఆత్మహత్య చేసుకున్నారు. కన్నవారికి కడుపు కోత మిగిల్చారు. మద్దిపూడి మండలంలోని పన్నూరు గ్రామంలో బెట్టింగులు పెట్టి అప్పులపాలైన యువకుడు ఆత్మహత్య చేసుకోవడంతో స్థానికంగా విషాదం అలముకుంది. పలు రకాల బెట్టింగులకు బానిసలుగా మారుతున్న యువతను ఉలిక్కిపడేలా చేసింది. గ్రామానికి చెందిన కరేటి రామాంజనేయులు (21) సెల్‌ఫోన్‌లో విచ్చలవిడిగా బెట్టింగులు పెట్టాడు. అప్పులపాలు కావడంతో పాటు ఆ విషయం ఇంట్లో తెలియడంతో మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. పొదిలిలోని కలాం కళాశాలలో చదువుకుంటున్న రామాంజనేయులు.. సెలవులకు వచ్చి గ్రామంలోనే ఉంటున్నాడు. సెల్‌ఫోన్‌కు బానిసగా మారడంతో పాటు బెట్టింగ్ వంటి వ్యసనానికి పూర్తిగా బానిసయ్యాడు. అప్పులు అధికమై చివరకు ఇంట్లో తెలియడంతో కుటుంబ సభ్యులు మందలించారు. మనస్తాపానికి గురైన రామాంజనేయులు గురువారం రాత్రి గ్రామ శివారులో ఉన్న చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రానికి వెళ్లి సెల్‌ఫోన్ పగలకొట్టాడు. అదే రేకులషెడ్ వద్ద ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు భోరున విలపించారు. శుక్రవారం ఉదయం పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పీ అంకమ్మరావు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని పొదిలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నరసింహనాయునిపాలెంలో కడుపునొప్పి తాళలేక...

దొనకొండ: మండలంలోని నరసింహనాయునిపాలెం గ్రామంలో కడుపునొప్పి తాళలేక ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై ఎం.సైదుబాబు తెలిపిన వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన శృంగారపు చిన్నమస్తాన్‌రెడ్డి (25) కడుపునొప్పితో తరచూ బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతునికి ఇంకా వివాహం కాలేదు. తల్లి అనసూయమ్మ ఫిర్యాదు మేరకు సంఘటన స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కడపరాజుపల్లెలో...

పెద్దదోర్నాల: మండల పరిధిలోని కడపరాజుపల్లె గ్రామంలో ఓ వ్యక్తి అనుమానాస్పదస్థితిలో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన పెరుమాళ్ల శాంతయ్య (26) గురువారం అర్ధరాత్రి ఇంటి వరండాలోని ఇనుపరాడ్డుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. సమాచారం అందుకున్న ఎస్సై శ్రీనివాసరావు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు చేపట్టారు. శాంతయ్యది నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం శివాపురం గ్రామం కాగా, కడపరాజుపల్లెకు చెందిన గోన రంగయ్య కుమార్తె శాంతకుమారిని వివాహం చేసుకుని ఇక్కడే నివసిస్తున్నాడు. ఈ క్రమంలో ఇంట్లో అందరూ నిద్రిస్తున్న సమయంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఏ కారణం లేకుండా ఆత్మహత్య చేసుకోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. పూర్తి వివరాలు దర్యాప్తులో తేలాల్సి ఉందన్నారు.

అనవసరపు ఆరోపణలు తగవు


మాట్లాడుతున్న ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు

- బాబు సభకు వచ్చి, గాయపడి మృతి చెందిన వ్యక్తితో తమకు సంబంధం ఏంటి?
- రాళ్లు రువ్వింది టీడీపీ వర్గీయులే
- వైఎస్సార్ సీపీ నేతల ధ్వజం

యర్రగొండపాలెం: ఓ వ్యక్తి చంద్రబాబు సభకు హాజరై గాయాలతో మృతి చెందితే తమకు సంబంధం ఏమిటని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వర్గీయులపై ఆరోపణలు చేయడం తగదని.. ఆ పార్టీ నేతలు హెచ్చరించారు. శుక్రవారం స్థానిక రాజీవ్ అతిథి గృహంలో విలేకరులతో మాట్లాడారు. గత నెల 21న టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు దళితులకు క్షమాపణ చెప్పాలంటూ మంత్రి క్యాంపు కార్యాలయం ముందు శాంతి యుతంగా నల్లజెండాలతో నిరసన తెలిపామన్నారు. అయితే ఆయన తన కాన్వాయ్‌ను ఉద్దేశపూర్వకంగా క్యాంపు కార్యాలయం ముందు నిలిపి పచ్చ నాయకులు, కార్యకర్తలను రెచ్చగొట్టారని ధ్వజమెత్తారు. తమపై రాళ్లు రువ్విన ఘటనలో తమ వర్గీయులు గాయాలపాలయ్యారని వివరించారు. టీడీపీ వర్గీయులు విసిరిన రాళ్లకు పెద్దదోర్నాల మండలంలోని చిన్నగుడిపాడుకు చెందిన రాజయ్య అనేవ్యక్తికి గాయాలు అయి ఉండవచ్చని, అతను మృతి చెందితే ఆ నేరం తమపై మోపడం సరికాదన్నారు. ఇలాంటి శవ రాజకీయాలు తగవన్నారు. గత కొన్ని దశాబ్దాల నుంచి నియోజకవర్గంలో శాంతియుత వాతావరణం ఉందన్నారు. కానీ ఈ ప్రాంతంపై అవగాహన లేని వ్యక్తులు అలజడి సృష్టించటానికి ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఎన్నికలు సమీపిస్తుండటం వలన తమ ప్రాబల్యం నిలుపుకోవటానికి ఆరోపణలు చేస్తూ పబ్బం గడుపుకునే వారిని ప్రజలు తగిన బుద్ధి చెప్తారని హెచ్చరించారు. ఎంపీపీ దొంతా కిరణ్‌గౌడ్, వైఎస్సార్ సీపీ యర్రగొండపాలెం, పుల్లలచెరువు మండలాల అధ్యక్షులు కె.చిన్నఓబులరెడ్డి, బీవీ సుబ్బారెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి, జిల్లా పరిషత్ కో ఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్ బాష, సర్పంచ్ అరుణాబాయి, పెద్దకాపు జి.వెంకటరెడ్డి, నాయకులు ఎస్.వెంకటరెడ్డి, వై.వెంకటేశ్వరరెడ్డి, పబ్బిశెట్టి శ్రీనివాసులు పాల్గొన్నారు.

108 సర్వీస్ కమిటీ జిల్లా అధ్యక్షుడిగా మస్తాన్‌వలి


నూతన కమిటీ సభ్యులు

పొదిలి: పేదల ఆరోగ్య పెన్నిధి 108 అంబులెన్స్ జిల్లా నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఎన్జీఓ హోంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో నూతన కమిటీ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా దర్గా మస్తాన్‌వలి(టంగుటూరు) ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడుగా సీహెచ్ భాస్కర్(అర్ధవీడు), ప్రధాన కార్యదర్శిగా వెన్నా గాలిరెడ్డి(త్రిపురాంతకం), కోశాధికారిగా కొమ్ముల ఆదాం(పొదిలి)ని ఎన్నుకున్నారు. కమిటీ ఎన్నికను సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు సుబ్బారావు, కార్యదర్శి ఎం.రమేష్ పర్యవేక్షించారు.

ఆలయ పునఃనిర్మాణానికి సహకరించాలని వినతి

యద్దనపూడి: ఆలయం పునఃనిర్మాణానికి సహకరించాలని కోరుతూ శుక్రవారం ఆలయ డెవలప్‌మెంట్ సమితి సభ్యులు, గ్రామస్తులు జిల్లా దేవదాయశాఖ సహాయ కమిషనర్ పానకాలరావుకు వినతిపత్రం అందించారు. మండలంలోని పోలూరు గ్రామంలో ఉన్న గంగాభ్రమరాంబ సమేత చెన్నమల్లికార్జునస్వామి సుమారు 250 ఏళ్ల క్రితం నిర్మించారు. ఆలయం పూర్తిగా శిథిలావస్థకు చేరి ఆలయం మొత్తం పల్లంగా ఉండటంతో వర్షపునీరు, మురుగునీరు గర్భాలయంలోకి చేరి స్వామివారి మూలవిరాట్‌లు సైతం ముంచెత్తటంతో నూతన ఆలయం నిర్మించాలని గ్రామస్తులు నిర్ణయించుకున్నారు. ఈ మేరకు సూమారు రూ.2 కోట్లతో ఆలయ పునఃనిర్మాణం చేయాలని భావించి ఈ విషయాన్ని గ్రామస్తులు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లటంతో ఏసీ పానకాలరావు ఆలయాన్ని సందర్శించి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మ్యాచింగ్ కాంట్రిబ్యూషన్ కింద రూ.30 లక్షల ఇవ్వడానికి సిద్ధమన్నారు.

కాలనీ నిర్మాణాల్లో అలసత్వం వద్దు

- జేసీ శ్రీనివాసులు


మ్యాప్‌ను పరిశీలిస్తున్న జేసీ శ్రీనివాసులు, ఆర్డీవో అజయ్‌కుమార్

పామూరు: వైఎస్సార్ జగనన్న లేఅవుట్‌లలో కాలనీల నిర్మాణాలను వేగవంతం చేయించాలని జేసీ కె. శ్రీనివాసులు ఆదేశించారు. గుమ్మనంపాడువద్ద గల లేఅవుట్‌ను శుక్రవారం కనిగిరి ఆర్డీఓ తోట అజయ్‌కుమార్‌తో కలిసి పరిశీలించారు. కొందరు లబ్ధిదారులు మాట్లాడుతూ తాము ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇళ్లు కట్టుకోలేకపోతున్నామని జేసీ దృష్టికి తీసుకువచ్చారు. స్పందించిన జేసీ.. 3వ ఆప్షన్‌గా కొందరు లబ్ధిదారులను గ్రూపుగా ఏర్పాటు అయితే ఆ నిర్మాణాలను ఓ కాంట్రాక్టర్ అప్పగించవచ్చన్నారు. అలాగే ప్రభుత్వ నిధులతోపాటు, అదనంగా ఇచ్చే రూ. 35 వేలను లబ్ధిదారుల అంగీకారంతో ఇప్పించి నిర్మాణాలు పూర్తిచేసే ఆలోచనలో ఉన్నట్లు చెప్పారు. లేఅవుట్‌లలో విద్యుత్, రోడ్డు మార్గాలు కొంతమేర పూర్తయ్యాయని మిగిలిన సదుపాయలు కూడా త్వరితగతిన పూర్తి చేయాలని జేసీ సూచించారు. పొదుపు గ్రూపుల్లో ఉన్నవారికి రుణాలు మంజూరయ్యేలా చూడాలని ఏపీఎం రజనీకుమారిని ఆదేశించారు. తహసీల్దార్ జ్వాలా నరసింహం, మండల ప్రత్యేకాధికారి మధుసూదన్ రెడ్డి, ఎంపీపీ గంగసాని లక్ష్మి, ఎంపీడీవో వి.శ్రీనివాసులు, వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గంగసాని హుసేన్‌రెడ్డి, కోఆప్షన్ నాయబ్‌రసూల్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పాల్‌రాజు, ఆర్ఐ నరగా ప్రవీణ్ పాల్గొన్నారు.

చంద్రబాబుకు ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయం


ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు

కనిగిరి రూరల్: టీడీపీ నేత చంద్రబాబుకు రాష్ట్ర ప్రజలు తిరిగి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్ గఫార్ అన్నారు. చంద్రబాబు నాయుడు అహంకార, అప్రజాస్వామిక వ్యాఖ్యలకు నిరసనగా శుక్రవారం కనిగిరిలో వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక పామూరు బస్టాండ్‌లో జరిగిన మానవహారం జరిగింది. ఈ సందర్భంగా పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎస్‌కే రంగనాయకులరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు సంగు సుబ్బారెడ్డి, ఎంపీపీ ప్రకాశం, ఏపీ ఎంసీ సభ్యులు డాక్టర్ పెరుగు మురళి కృష్ణ మాట్లాడుతూ టీడీపీ నేత చంద్రబాబు పేద వర్గాల పట్ల చులకనభావంతో మాట్లాడుతున్నాడని తీవ్రంగా దుయ్యబట్టారు. పేదల సొంతింటి కల నెరవేర్చాలన్నా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యాన్ని ఎవరూ అడ్డుకోలేరన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలోనే అన్ని వర్గా ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. పార్టీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ సాల్మన్ రాజు, ఎస్‌కే జిలాని మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో చంద్రబాబును చిత్తుగా ఓడిస్తారన్నారు. టీడీపీ నేతలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజా మద్దతు వైఎస్సార్ సీపీకే ఉందని స్పష్టం చేశారు. సచివాలయ కన్వీనర్ వేల్పుల వెంకటేశ్వర్లు, జానీ, పెన్నా వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు దేవరాజ్, రామనబోయిన శ్రీను, రాజీవ్, ఖాశింసా, పులి శ్రీనివాసులరెడ్డి, ఖాజా, మీరావలి, నక్కా రామకృష్ణ, షఫీ ఆజాద్, డాక్టర్ రసూల్, దాసరి మురళీ, మన్సూర్, నాయకులు శ్రీహరిరెడ్డి, పిల్లి లక్ష్మీనారాయణ రెడ్డి, కంటు గురవయ్య, తిరుపతయ్య, మాలీ, కాస్తాల బాలాజీ, సిగా కృష్ణారావు, డి. రవి, సంగు వెంకటేశ్వర్లు నాగేంద్ర, మున్నా పాల్గొన్నారు.

నెమలీకల టోపీ ధరించి కోలాహలంగా ఆడతారు.
రేలా... రే... రేలా అంటూ గొంతు కలిపి పాడతారు.
ప్రకృతి గురువు నేర్పిన పాఠాలకు ఆనవాళ్లు వారు.
మొన్నటి వరకు అడవి తల్లి ఒడిలో దాగిన కళారూపాలివన్నీ.
నేడవి అడవి గోడలు దాటి నగరాన్ని ఉర్రూతలూగిస్తున్నాయి.
దేశం ఎల్లలు కూడా దాటే వరకు గుస్సాడి ఆడాలంటున్నారు...
పద్మశ్రీ కనకరాజు.





గుస్సాడి గుండెచప్పుడు

పద్మశ్రీ కనకరాజు

కనకరాజు పేరులో ఇంటి పేరు కనక, ఆయన పేరు రాజు. ఇన్ని వివరాలు మాకక్కర్లేదు, గుస్సాడి నృత్యం చేస్తాడు, మా అందరి చేత అడుగు వేయిస్తాడు కాబట్టి ఆయన మాకు 'గుస్సాడి రాజు' అంటారు స్థానికులు. ఆయన పద్మశ్రీ అందుకున్నప్పటి నుంచి నాగరక ప్రపంచం ఆయన మీద దృష్టి కేంద్రీకరించింది. కనక రాజు అని ఇంటిపేరుతో కలిసి వ్యవహారంలోకి వచ్చారు. అయినప్పటికీ వారి గూడేలకు వెళ్లి కనకరాజు అని అడిగితే వెంటనే గుర్తుపట్టరు. గుస్సాడి కనకరాజు అంటే టక్కున చెప్పేస్తారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మర్లవి ఆయన ఊరు. ప్రస్తుతం కుమ్రుం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా, అంతేకాదు, కుమ్రుం భీమ్ వారసులు కూడా. ఆదిలాబాద్‌లో విస్తరించిన గోండ్ తెగకు చెందిన వాళ్లందరూ భీమ్ వారసులుగా గర్వంగా భావిస్తారు. ఎనభై ఏళ్ల కనకరాజు... తండ్రి చెప్పిన మాట కోసం గుస్సాడి నృత్యం పరిరక్షణకు జీవితాన్ని అంకితం చేశారు. గుస్సాడితో మమేకమైన తన జీవితానుభవాలను సాక్షితో పంచుకున్నారాయన.

ఆట... పాట... జీవితం!

"మా ఆదివాసీల జీవనంలో ప్రకృతి, నృత్యం, గానం కలగలిసి పోయి ఉంటాయి. బిడ్డ పుడితే పాట, పెళ్లి వేడుకకీ పాట, అంతే కాదు... మనిషి పోయినా పాట రూపంలో ఆ వ్యక్తితో మా అనుబంధాన్ని గుర్తు చేసుకుంటాం. దండారీ ఉత్సవాలంటే మాకు ఎక్కడ లేని ఉత్సాహం వచ్చేస్తుంది. మగపిల్లలకు నృత్యం, ఆడపిల్లలకు రేలా పాట చిన్నప్పటి నుంచే నేర్పిస్తాం. గుస్సాడి నృత్యంలో అడుగులు వేయడం ఎప్పుడు మొదలైందో నాకు గుర్తు లేదు. కానీ మా నాన్న ఒక మాట చెప్పేవారు. 'ఈ నృత్యమే మనకు దైవం. 'ఈ నృత్యాన్ని మరువద్దు. తరతరాలుగా మోసుకొస్తున్నాం. దీన్ని కాపాడుకుంటేనే దేవుడు మనల్ని కాపాడుతాడు' అని చెప్పేవాడు. ఆ మాట నాలో నాటుకుపోయింది. నాకు వయసొచ్చినప్పటి నుంచి నృత్యంలో తొలి ఆటగాడిగా అడుగులు వేస్తుండేవాణ్ని. ఆదిలాబాద్ జిల్లాలో ఆదివాసీలు నివసించే రెండువేల గూడేలకూ నేను తెలిసిపోయాను.

గణతంత్ర వేడుక

గణతంత్ర వేడుకల్లో మా ప్రాచీన వారసత్వ కళ అయిన గుస్సాడి నృత్యాన్ని ప్రదర్శించే అవకాశం నాకు 1982లో వచ్చింది. అప్పుడు ప్రధానమంత్రి ఇందిరా గాంధీకి మా గుస్సాడి టోపీ పెట్టించి, గజ్జెలు



2021లో రాష్ట్రపతి చేతుల మీదుగా పద్మశ్రీ పురస్కారం అందుకుంటూ...



సంప్రదాయ వస్త్రధారణలో గుస్సాడి కనకరాజు

కట్టించాం. ఆమె మాతో అడుగులు వేసింది. ఆ తర్వాత ఓసారి అబ్దుల్ కలామ్ కూడా మాతో అడుగులు వేశారు. హైదరాబాద్‌లో ఎన్ని ప్రదర్శనలిచ్చామో లెక్కే లేదు. ఢిల్లీలో ఆజాదీ కా అమృత్ మహోత్సవ్‌లో కూడా మా గుస్సాడిని ప్రదర్శించాం. మరో పది దఫాలు యువతతో చేయించాం. నాయన మాట మీద గుస్సాడి కోసం బతికినందుకే మా దేవుడు మెచ్చి గొప్ప వాళ్ల కిచ్చే పద్మశ్రీని ఇప్పించాడనుకుంటున్నా.

నెమలీకల టోపీ

మా నృత్యం సాధన చేయడమే కాదు, టోపీ, దుస్తులు, గజ్జెలు అన్నీ ప్రత్యేకమే. వాటిని తయారు చేయడానికి చాలా నైపుణ్యం ఉండాలి. పెద్ద టోపీకి రెండు వేల పింఛాలుంటాయి. మా ఇళ్లలో వాటిని భద్రపరుచుకోవడం పెద్ద పని. మా ముత్తాతలు ధరించిన టోపీ ఇంకా నేను ధరిస్తూనే ఉన్నాను. కొత్తవాళ్ల కోసం టోపీలు తయారు చేస్తున్నాం. పెద్ద టోపీ, దుస్తులతోపాటు మొత్తం వేషానికి ఇరవై వేల రూపాయలవుతాయి. మా ఆదివాసీ వ్యక్తి తుకారామ్ సాబ్ కలెక్టర్ అయిన తరవాత ఈ నృత్యానికి ఇంకా కొన్ని చేర్పులు చేసి బాగా మంచిగా చేశారు. పద్మశ్రీ వచ్చిన తర్వాత ఐటీడీఏ ఆఫీసర్‌లు గుస్సాడి నృత్యం నేర్పించడానికి వందకు పైగా బడులు పెట్టారు. ఒక్కో బడిలో రెండు-మూడు వందల మంది నేర్చుకుంటున్నారు. నేను పెద్ద మాస్టర్ (చీఫ్ డాన్స్ మాస్టర్)ని. గుస్సాడి, రేలా పాట నేర్పించడానికి 30 మందిని ప్రత్యేకంగా తయారు చేశాను. మరో రెండు వందల మందికి సంపూర్ణంగా శిక్షణనిచ్చాను. ఇంక మామూలుగా నేర్చుకుని ఆడే వాళ్లు ఎన్ని వేల మంది ఉన్నారో నేను ఎప్పుడూ లెక్క చెప్పుకో లేదు.

అడవి తల్లికి అందరూ ఒక్కటే!

మా ఆదివాసీల్లో మగపిల్లాడు ఎక్కువ, ఆడపిల్ల తక్కువనే ఆలోచనే ఉండదు. బిడ్డలంతా సమమే. పెళ్లిలో కట్నకానుకలు ఉండవు. ఆడబిడ్డ పుట్టిందని చింతపడడం మాకు తెలియదు. నాకు ఎనిమిది మంది కూతుళ్లు, ముగ్గురు కొడుకులు. బతకడానికి ఆశ్రమ పాఠశాలలో రోజు కూలీగా పని చేస్తూ కూడా అందరికీ చదువు చెప్పించాను. తొమ్మిది- పది తరగతుల వరకు అందరూ చదువుకున్నారు. రెండో కొడుకు వెంకటేశ్ మాత్రం డిగ్రీ చదివి టీచర్ ఉద్యోగం చేస్తున్నాడు. తరతరాలుగా అడవులకే పరిమితమైపోయిన గుస్సాడి నృత్యాన్ని నేను దేశానికి తెలియ చెప్పాను. మీరు మన ఆట, పాటలను ఇతర దేశాలకు తీసుకెళ్లాలని నా పిల్లలు, శిష్యులకు చెబుతున్నాను" అని తన ఆకాంక్షను వ్యక్తం చేశారు గుస్సాడి కనకరాజు.

– వాకా మంజులారెడ్డి

సందర్భం

స్కూల్ రోజుల్లో నియతికి లెక్కలు అంటే లెక్కలేనంత భయం.
ఇప్పుడు ఆమెకు వ్యాపార లెక్కలు కొట్టిన పిండి.
అప్పట్లో సైన్స్ సబ్జెక్ట్ పేరు వినబడగానే ముఖం తిప్పుకునేది చిన్నారి నియతి.
ఇప్పుడు ఆమెకు వంటల శాస్త్రం లోతుపాతులు బాగా తెలుసు.
చిన్న వయసులోనే 'స్టార్ చెఫ్'గా పేరు తెచ్చుకున్న
ముంబైకి చెందిన **నియతిరావు** 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఏషియా–2023'
జాబితాలో చోటు సంపాదించింది...

సాహోరే స్టార్ చెఫ్



నియతిరావు

చిన్నప్పుడు నియతిరావు బడి అంటే భయపడేది. లెక్కలు, సైన్స్ అంటే చాలు ఆమెకు వణుకు వచ్చేది. అలాంటి నియతికి అమ్మ, అమ్మమ్మలు చేసే వంటలు అంటే ఇష్టం. వాళ్ల వంటలు చేస్తుంటే ఆసక్తిగా గమనించేది.

తల్లి గుజరాతీ. తండ్రి దక్షిణ భారతం. దీంతో అటు వంటకాలు ఇటు, ఇటు వంటకాలు అటూ వెళ్లేవి. వంటలను అమితంగా ప్రేమించే ఆ ఇంట్లో ఉత్తరాది, దక్షిణాది అనే తేడా లేకుండా ఎన్నో వంటకాలు చవులూరించేవి. 'తినరా మైమరిచి' అని ఆప్యాయంగా పిలుస్తుండేవి.

'అదృష్టాన్ని నమ్ముకోకుండా ఆసక్తి ఉన్న రంగాన్ని ఎంచుకోండి, అద్భుత ఫలితాన్ని సొంతం చేసుకోండి' అనే మాటను ఎన్నోసార్లు విన్న నియతి తనకు నచ్చిన రంగాన్ని ఎంచుకొని చెఫ్‌గా మారింది.

కోపెన్‌హెగన్(డెన్మార్క్)లో వరల్డ్ ఫేమస్ రెస్టారెంట్ నోమాలో ఇంటర్న్‌షిప్ తరువాత తిరిగి ముంబైకి వచ్చింది.

'ఇప్పుడు ఏ వ్యాపారమైనా రిస్క్' అనుకునే సమయం అది.

నేను తెలుసుకున్న సత్యం





వంటకం అంటే ఆకలి తీర్చుకోవడం. రుచులను ఆస్వాదించ డానికే పరిమితమైనది కాదు. అది మన సంస్కృతి. మనం పరస్పరం ఇచ్చుకునే గౌరవం. తరం నుంచి తరానికి మధ్య కదిలే జ్ఞాపకం. గత దశాబ్ద కాలంలో నేను నేర్చుకున్న ఏకైక విషయం... మన భారతీయ వంటకాలు ఎంతో గొప్పవి అని. వాటికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం ఉంది అని. మన వంటకాలలో ఉపయోగించే దినుసులపై ప్రత్యేకంగా దృష్టి పెడితే ఎన్నో కాంబినేషన్‌లు, టెక్నిక్స్ గురించి తెలుసుకోవచ్చు. కొత్త రుచులను ఆస్వాదించవచ్చు.

– నియతిరావు

అలాంటి సమయంలో 'ఎక్కా' రెస్టారెంట్ ప్రారంభించడానికి రెడీ అయింది. ప్రాజెక్ట్ పట్టాలెక్కుతున్న సమయంలో ఇన్వెస్టర్‌లు వెనకడుగు వేశారు.

'కొన్ని సమయాల్లో డబ్బు కంటే మన మీద మనకు నమ్మకం చాలా అవసరం' అంటున్న నియతి ఆరోజు ధైర్యాన్ని కోల్పోయి ఉంటే, 'ఇక చేసేదేమీ లేదు' అనే నిర్లిప్తతకు గురై ఉంటే 'స్టార్ చెఫ్'గా అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకునేది కాదు.

కొత్త ఇన్వెస్టర్‌లను ఒప్పించడానికి ఎంత కష్టపడిందో తెలియదుగానీ మొత్తానికైతే 'ఎక్కా' రెస్టారెంట్ కలను సాకారం చేసుకుంది.

పద్నాలుగు నెలల వ్యవధిలోనే 'ఎక్కా' ఆసియాలోని అత్యుత్తమ రెస్టారెంట్‌ల జాబితాలో చోటు సంపాదించింది.

ఈ ఘన విజయానికి కారణం ఏమిటి?

'మెనూ చూడగానే నోరూరడం మాత్రమే కాదు, పాత జ్ఞాపకాలు మదిలో నిండి పోవాలి. ఆ రోజుల్లో మా అమ్మ ఈ వంటకాన్ని అలా చేసేది. ఎంత బాగుండేదో కదా!... ఇలాంటి జ్ఞాపకాలెన్నో దృశ్యాలై కళ్లముందు నిలవాలి' అంటున్న నియతి తన రెస్టారెంట్‌ను ఆషామాషీగా ప్రారంభించలేదు.

ఎంతో గ్రౌండ్ వర్క్ చేసింది.

ఎన్నోచోట్ల సర్వే చేసి కస్టమర్‌ల అభిప్రాయాలను, అభిరుచులను తెలుసుకుంది.

ఏ రెస్టారెంట్ ఎందుకు సక్సెస్ అయింది? ఎందుకు అట్టర్ ఫ్లాప్ అయింది? తెలుసుకోవడానికి కేస్‌స్టడీ చేసింది.

వాటన్నిటినీ ఒక దగ్గర జోడించి, దానికి రుచి జత చేసి పక్కా ప్లాన్‌తో 'ఎక్కా' మొదలుపెట్టింది.

'నేను నేర్చుకున్నాను' అనేవారు ఒక రకం.

'నేను నేర్చుకుంటూనే ఉంటాను' అనేవారు రెండో రకం.

నియతి రెండో రకం.

'భారతీయ వంటకాలలో ఉపయోగించే దినుసులు వేటికవే ప్రత్యేకమైనవి. వాటి ఘుమఘుమలు మరో లోకంలోకి తీసుకువెళతాయి' అంటున్న నియతి దినుసులతో కొత్త ప్రయోగాలు చేస్తూ, కొత్త రుచులను పరిచయం చేస్తుంటుంది.

'ఎక్కా' నిర్వహిస్తున్న బిల్డింగ్‌లోనే 'కేయంసీ' అనే కమ్యూనిటీ స్పేస్‌ను లాంచ్ చేసింది నియతి. 'కేయంసీ' అనేది సృజనాత్మక వంటల ఎగ్జిబిషన్. వాటి గురించి వివరంగా మాట్లాడుకునే చర్చా వేదిక.

'నియతి భవిష్యత్ దార్శనికురాలు. నిత్యప్రయోగశీలి. తన చురుకుదనంతో టీమ్ మెంబర్స్‌లో ఉత్సాహం నింపుతుంది. ప్రతిభ, నాయకత్వ సామర్థ్యం ఉన్న నియతి చిన్న వయసులోనే పెద్ద పేరు తెచ్చుకుంది' అంటున్నారు 'ఎక్కా' ఫస్ట్ ఇన్వెస్టర్ శిల్ప లక్ష్మీనారాయణ్.

'రెస్టారెంట్ అంటే రుచుల సమ్మేళనం మాత్రమే కాదు దానికి సామాజిక బాధ్యత కూడా ఉంది' అంటున్న 28 సంవత్సరాల నియతిరావు మరిన్ని విజయాలు సాధించాలని ఆశిద్దాం.

కొత్త దారి

ఆ కట్టుబడికి తరించేను గుర్రపుడెక్క జన్మ!

25 కిలోల గుర్రపు డెక్క నుంచి ఒక ఫ్యూజన్ చీర తయారు చేయవచ్చు.

'గుర్రపు డెక్కతో సమస్యలు ఇన్నిన్ని కాదయా' అనే విషయం మనకు తెలియనిదేమీ కాదు. నీటివనరుల పాలిట శత్రువుగా పరిగణించే గుర్రపు డెక్క నుంచి అందమైన చీరలు తయారు చేస్తూ 'ఆహా' అనిపిస్తున్నాడు ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ గౌరవ్ ఆనంద్...

జార్ఖండ్‌లోని జంషెడ్‌పూర్‌కు చెందిన గౌరవ్ ఆనంద్ టాటా స్టీల్‌లో పనిచేస్తున్న రోజుల్లో నదుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవాడు. ఆ సమయంలో నదులలో దట్టంగా పేరుకుపోయిన గుర్రపు డెక్క అతడి దృష్టిలో పడేది.

'దరిద్రపు మొక్కలు' అని దాన్ని గురించి ప్రజలు తిట్టుకోవడాన్ని ఎన్నోసార్లు విన్నాడు.

'క్లీన్ రివర్ గంగా' మిషన్‌లో పాల్గొన్న తరువాత ప్రతివారం ఎక్కడో ఒకచోట నదులు, కాలువలు, చెరువుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో తప్పనిసరిగా పాల్గొనేవాడు.

'నది లేదా చెరువులు, కాలువలను ఒకసారి గుర్తు తెచ్చుకుంటే నీళ్లు కాదు గుర్రపుడెక్క మాత్రమే కళ్ల ముందుకు వచ్చేది' అంటాడు గౌరవ్.

జలవనరుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో మరింత విస్తృతంగా పాల్గొనడానికి కార్పొరేట్ ఉద్యోగాన్ని వదిలి 'స్వచ్ఛత' అనే ఫౌండేషన్‌కు శ్రీకారం చుట్టాడు గౌరవ్. ఒకవైపు పర్యావరణ సంబంధిత కార్యక్రమాల్లో పాల్గొంటూనే మరోవైపు గుర్రపు డెక్కపై ప్రయోగాలు చేసేవాడు.

మొదట్లో...

గుర్రపు డెక్కను ఉపయోగించి ల్యాంప్ షెడ్స్, పేపర్లు, నోట్‌బుక్‌లు, మ్యాట్‌లు... మొదలైనవి తయారు చేసేవాడు. ఆ సమయంలో 'ఇంకా ఏం చేయలేమా?' అని మేధోమథనం చేస్తున్న క్రమంలో పుట్టిన ఆలోచనే... గుర్రపు డెక్క నుంచి చీర. ఇలాంటి చీర ప్రపంచంలోనే మొదటిది. అయితే 'గుర్రపు డెక్క నుంచి చీరె' అనేది అంత సులువైన పని కాదు. ఎంతో ఓపిక ఉండాలి.

కాండాలను వారం రోజులపాటు ఎండ బెట్టడం, హాట్ వాటర్ ట్రీట్‌మెంట్ ద్వారా గుజ్జు నుంచి క్రిములను తొలగించడం, ఆ తరువాత దారం తయారు చేయడం పెద్ద పనే. అయితే గౌరవ్ ఎక్కడా డీలా పడలేదు. రెట్టించిన ఉత్సాహంతో పనిచేయడం అలవాటు చేసుకున్నాడు.

ఈ ఏడాది చివరి కల్లా 1000 చీరెలను తయారు చేయాలని లక్ష్యంగా నిర్ణయించుకున్నాడు గౌరవ్.



గౌరవ్ ఆనంద్



గుర్రపు డెక్క ద్వారా ఉపాధి

గుర్రపు డెక్క నుంచి తయారైన చీర ధరించిన మహిళ

పనికిరాని గుర్రపు డెక్క నుంచి అందమైన చీరెలను తయారు చేయడం ఒక కోణం అయితే గుర్రపు డెక్కను సేకరించి అమ్ముకోవడం ద్వారా ఎంతోమంది మహిళలు ఉపాధి పొందడం అనేది మరో కోణం.

నలభై ఏడు సంవత్సరాల రమ్యకు భర్త చనిపోయాడు. ఆమె ఒక పొగాకు ఫ్యాక్టరీలో తక్కువ జీతానికి పనిచేసేది. ఆరోగ్యం దెబ్బ తినడంతో ఉద్యోగం మానేసింది. గుర్రపు డెక్క సేకరణ ద్వారా రమ్య ఉపాధి పొందుతోంది.

'రోజుకు రెండు నుంచి మూడు గంటలు కష్టపడితే చాలు' అంటుంది రమ్య.

ప్రస్తుతం జంషెడ్‌పూర్ (జార్ఖండ్), ఖరగ్‌పూర్ (పశ్చిమ బెంగాల్)లో ఆఫ్‌లైన్ స్టోర్‌లలో ఈ చీరెలను అమ్ముతున్నారు. మధ్య తరగతిని దృష్టిలో పెట్టుకొని ధరలు నిర్ణయించారు.

'చీరెల ద్వారా లాభాలు గడించాలనేది నా లక్ష్యం కాదు. చేనేత కార్మికుల ఆర్థిక స్థాయి మెరుగు పడాలనేది నా కోరిక' అంటున్నాడు గౌరవ్ ఆనంద్.

'చెరువుల ప్రక్షాళనకు సంబంధించిన కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పుడు అంతూపొంతూ లేని గుర్రపు డెక్కను చూసి బాగా కోపం వచ్చేది. తిట్టుకునేదాన్ని కూడా. ఇప్పుడు అది అపురూపంగా కనిపిస్తోంది. ఉపయోగించుకుంటే ఏదైనా ఉపయోగమే' అంటుంది పర్యావరణ కార్యకర్త నళిని.

ఇప్పుడు తన ఫేవరెట్ చీర... గుర్రపు డెక్క నుంచి తయారుచేసిన ఫ్యూజన్ చీర!

* న్యూ బిజినెస్

ఫేస్ యోగా విత్ ఆయిల్స్



బ్యూటీ ప్రాడక్ట్స్‌తో అరోరా

తనకు వచ్చిన కష్టాన్ని తలుచుకుంటూ కుంగిపోలేదు విభూతి అరోరా. నిరాశగా అనిపించే రోజులనే అవకాశాలుగా మార్చుకొని నేడు సౌందర్య ఉత్పత్తుల వ్యాపారంలో అగ్రగామిగా నిలిచింది. దానికి ముందు అనుభవించిన శారీరక, మానసిక బాధ దానిని ఎదుర్కొన్న పరిణామాలను వివరిస్తుంది ఈ గురుగ్రామ్ వాసి.

"నాకు పాతికేళ్ల వయసులో చర్మానికి సంబంధించిన 'లూపస్' అనే ఆటో ఇమ్యూన్ సమస్య వచ్చింది. ముఖం అంతా దద్దుర్లు వచ్చాయి. చర్మం పగిలి రక్తం కారుతుండేది. ఈ పరిస్థితి ఎంత భయంకరంగా ఉండేదంటే నా రూమ్ దాటి బయటకు వచ్చేదాన్నే కాదు. నా ముఖం ఎవరూ చూడకూడదని లోపలే ఉండిపోయేదాన్ని. రోజంతా ఏడుస్తూ నిద్రపోయేదాన్ని. ఎవరిలోనూ కలవకపోవడం వల్ల నా బంధుమిత్రులకు వ్యతిరేకిని కూడా అయ్యాను. కొన్ని రోజులకు ఒంటరితనంతో నాకు పిచ్చిపడుతుందేమో అనిపించేది.

పెళ్ళిని వదిలేసి..

ఇంతలో మా ఫ్రెండ్ పెళ్లికి రమ్మని ఆహ్వాన పత్రిక వచ్చింది. చాలా సంతోషం అనిపించింది నా స్నేహితులందరినీ కలవచ్చని. ఒక రోజు ముందే ఆ పెళ్లికి వెళ్లాను. డాక్టర్ చెప్పిన మందులను ఆ రాత్రి వేసుకున్నాను. మొత్తం రియాక్షన్ వచ్చింది. ముఖంతో పాటు శరీరం అంతా దద్దుర్లు. దీంతో పెళ్లిలో ఎవరినీ కలవకుండానే ఇంటికి తిరిగివచ్చేశాను. మళ్లీ డాక్టర్ని కలిశాను కానీ, ఎలాంటి ప్రయోజనం లేకపోయింది.

అమ్మమ్మ చిట్కాతో...

ఏం తింటున్నాను, ఏం షాంపూ, ఫేస్ వాష్ ఏది వాడుతున్నాను అనేవి మళ్లీ మళ్లీ చెక్ చేసుకున్నాను. ఎందువల్ల ఈ వ్యాధి వ్యాపిస్తుందో నాకు అర్థం కాలేదు. చాలామంది వైద్యులను సంప్రదించాను. కానీ, నా సమస్య పరిష్కారం కావడం లేదు. ఒకరోజు మా అమ్మమ్మ సూచించిన ఇంటి చిట్కాను ఉపయోగించడం మొదలుపెట్టాను. దేశీ నెయ్యితో ముఖానికి మసాజ్ చేయడం ప్రారంభించాను. దాంతోపాటు కొద్దిగా ఫేస్ యోగా చేయడం మొదలుపెట్టాను. మెల్ల మెల్లగా ఆ ప్రభావం నాకు తెలిసి వచ్చింది. దాదాపు పదేళ్లుగా పోరాడుతున్న సమస్యకు ఉపశమనం లభించింది.

కొత్త ఉత్పత్తి

దేశీ ఆవు నెయ్యి నాకు అమోఘంగా పని చేసింది. దీంతోపాటు ఫేస్ యోగాతో నా చర్మ సమస్యకు పరిష్కారం లభించింది. అంతే, ఇక నా ప్రయోగాలు మొదలయ్యాయి. ఆయుర్వేద నూనెలు, ఫేస్ యోగాతో అనుసంధానిస్తూ ఒక కొత్త ఉత్పత్తిని తయారు చేయడం మొదలుపెట్టాను. అలా, నాలుగేళ్ల క్రితం 'హౌస్ ఆఫ్ బ్యూటీ' మొదలైంది.

సెల్ఫ్ డిజైన్ ఫేస్ యోగా

రుగ్వేదంలో ముఖానికి 8 యోగాసనాలు ఉన్నాయి. నాకు అనారోగ్యం వచ్చినప్పుడు దాదాపు 80 ముఖ యోగా భంగిమలు చేశాను. దీంతో తేలికపాటి మచ్చలు కూడా తగ్గిపోయాయి. దాని ప్రభావం నా ముఖంపై కనిపించినప్పుడు మా కుటుంబ సభ్యులు, స్నేహితులు అడగడం మొదలుపెట్టారు. ఆ తర్వాత మాకు కూడా ఫేస్ యోగాను నేర్పించండి అని తెలిసినవారు అడుగుతుండేవారు. దీంతో ముఖం కోసం 80 యోగాసనాలతో కూడిన కోర్సును డిజైన్ చేసి, ఉత్పత్తులతో సహా మార్కెట్‌లోకి విడుదల చేశాను. మొదట జనం దీనిని సీరియస్‌గా తీసుకోలేదు. కానీ, వాడి, ఆ ఫలితాన్ని అనుభవించిన వాళ్లు నా క్లాస్‌కి రావడం, వాళ్ల ద్వారా మరికొంతమంది చేరడం మొదలుపెట్టారు. మెల్ల మెల్లగా ఫేస్‌యోగా ప్రజాదరణ పొందింది.



ఫేస్ మసాజ్



ఫేస్ యోగా చేస్తూ...

సౌందర్య ఉత్పత్తులు

దేశీనెయ్యి, బాదం నూనెతో మసాజ్ ఆయిల్స్ తయారు చేశాను. రసాయనాలు లేని, అన్ని రకాల చర్మ తత్వాలకు సరిపోయే వివిధ సౌందర్య ఉత్పత్తులను తయారు చేశాను. ఏ రసాయనాలు లేని ఉత్పత్తులు వాడటం వల్ల ఎలాంటి చర్మ సమస్యలూ తలెత్తవు. అయితే, అది అంత తేలికైన పనికాదని కొన్ని రోజులకే అర్థమైంది. ఇప్పటికే ఎన్నో బ్యూటీప్రాడక్ట్స్ మార్కెట్‌ని ఏలుతున్నాయి. నా సొంత ఆలోచనతో పనిచేయడానికి చాలా ప్రయత్నాలు చేయాల్సి వచ్చింది. రసాయన రహిత ఉత్పత్తుల షెల్ఫ్ కాలం రెండేళ్లు మాత్రమే ఉంటుంది. కాబట్టి, అమ్మడం కష్టంగా ఉండేది. బ్యూటీప్రాడక్ట్స్ మార్కెట్ చేసే వాళ్లు నా ప్రాడక్ట్స్‌ని తీసుకోవడానికి ఇష్టపడలేదు. దీంతో నా వ్యాపారానికి చాలా ప్రతిబంధకాలు ఉన్నాయని అని అర్థమైంది.

ఫేస్‌యోగా విత్ బ్యూటీ ప్రాడక్ట్

కానీ, నేడు అలియాభట్, మలైకా అరోరా వంటి సెలబ్రిటీలు నా ఉత్పత్తులు కొనుగోలు చేయడం, వాళ్లు నా ఫేస్ మసాజ్ టూల్‌తో మా ప్రాడక్ట్స్‌కు సంబంధించిన వీడియోను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేయడంతో చాలా విజయం సాధించాను అనిపించింది. ఇది నాకు ఉచితంగా లభించిన ప్రమోషన్. దీంతో నా ఉత్పత్తులకు మరింత ప్రజాదరణ లభించింది. నాలుగేళ్లలోనే నా ప్రాడక్ట్స్ సెలబ్రిటీలు ఉపయోగించే దశకు చేరుకుంది. దీంతో నాకు చాలా సంతోషంగా ఉంది. ప్రతికూల పరిస్థితుల నుంచి బయటపడి నాకు నేనుగా నిలదొక్కుకోవడానికి చేసిన కృషిలో మా కుటుంబ విజయం కూడా దాగుంది' అని వివరిస్తుంది అరోరా.